


# బోడి

తమిళ మూలం: జయంతన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్




**మీరు కావాలనుంటే** ఇప్పుడు కూడా ఆమెను ఆ గ్రామంలో చూడవచ్చు.

కాస్త పొట్టిగా కనిపించే రూపం. ఎత్తు లేకున్నా మరీ లావు అనిపించని ఆకృతి. వంటి మీద ముతక చేనేత చీర. పచ్చ రంగు లేదా నీలం.

రవిక వేసుకునే అలవాటు లేదు. వెంటనే మీరు అదోలాంటి ఆలోచన్లకి పరుగుపెట్టకండి. పైట ఎల్లవేళలా స్థానభ్రంశం చెందకుండా పొందికగా ఉంటుంది. రవిక కూడా ఎప్పుడైనా తన బాధ్యతను విస్మరించడం జరుగుతుందో ఏమో. ఇది మాత్రం చెక్కు చెదరదు.

ఛామన ఛాయ, వయస్సు ముప్పై లేదా ముప్పై రెండు. బోడి తల, దానిమీద ఒక ఇత్తడి బిందె చంకలో ఒక బిందె అంతే, ఈ గెటప్‌లో ఆ ఊరిలో వేరే ఎవరూ లేరు. ఊరికీ నీళ్ళ బావికి మధ్య పదినిమిషాలకొకసారి ఆమెను చూడవచ్చు.

దగ్గరికి వెళ్ళి చూసారంటే ఆ ముఖంలో ఆడతనపు ఛాయలు, అందంలాంటి లక్షణాలు ఏమీ ఉన్నట్లు పెద్దగా కనబడవు. మరీ అనాకారి కాదు. కాని ఒక స్త్రీగా ఆమెను ఎవరైనా గుర్తించి దరికి చేరుతారా అన్న సందేహం మీకు రాకపోదు.

ఇంటింటికి నీళ్ళు తెచ్చి నింపడమే ఆమె వృత్తి. ఎవరైనా అడిగితే లేదా నిర్భందిస్తే ఆ ఇంట్లో నాలుగు అంట్లు తోమడమో లేక పిల్లల బట్టలు ఉతికి పెట్టడమో చేస్తుంది. వేరే ఏ పనీ చేయదు.

కాని ఈ వృత్తిని ఆమె స్వీకరించిన ధోరణి కాస్త ఆశ్చర్యకరమైనది. ఆమె రాకపోకలను చూస్తే నీళ్ళు మోయకుండా ఆమె ఉండలేదేమోనని అనిపిస్తుంది. ఇంత చేసినా నెలకి ఆమెకి దొరికేది పాతికో పరకో. కాని ప్రొద్దున్న ఆరుగంటలకి బిందెలను నెత్తి మీద ఎక్కించుకుందంటే మళ్ళీ వాటిని దింపడానికి రాత్రి ఏ ఎనిమిదో తొమ్మిదో అవుతుంది. ఊళ్ళోకి నీళ్ళ బావికి మధ్య నడక... నడక... నడక. ఎప్పుడు వండుకుంటుందో ఎప్పుడు తింటుందో ఎవరికీ తెలియదు. కాని ఒక్క రోజు కూడా తన కాయకష్టం గురించి విసుక్కుంది లేదు. తను తాగే గంజి నీళ్ళకి ఇలా నీళ్ళు మోసుకుంటూ నడిచే శక్తి ఎక్కడ్నించి వస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి.

బోడి అన్నది అకారణంగా వచ్చిన పేరు. ఆమె అసలు పేరు చాలా మందికి తెలియను కూడా తెలియదు. అసలు పేరు గుర్తుకూడా రాని విధంగా ఈ పేరు చాలా ప్రసిద్ధి చెందింది. పేను కొరుకుడికి భయపడో, కొబ్బరి నూనె ఖర్చుకి వెనకాడో చీటికి మాటికి గుండు చేయించుకుంటుంది. అర సెంటిమీటర్ పొడువుకు మించిన జుట్టుతో ఆమెను చూసినవాళ్ళు గత పదేళ్ళుగా ఈ ఊళ్ళో ఎవరూ లేరు. ఇలాంటి గౌరవం తక్కువైన పిలుపుకి సాధారణంగా ఎవరైనా కాస్త చిన్న బుచ్చుకోవడం సహజం. కాని అలాంటి భావం ఏమీ ఆమె ముఖంలో కనబడదు. 'ఉన్న నిజాన్నే కదా మీరు చెపుతున్నారు' అన్న రీతిలో ఉంటుంది ఆమె ధోరణి. ఊర్లో ఉన్న చిన్న చితకా కూడా ఆమెను నోటినిండా "బోడీ!" అనే పిలుస్తారు.

ఆమె ఐదు ఇళ్ళకి నీళ్ళు మోసి పని ముగించిన తర్వాత ఆరో ఇంటిని ఒప్పుకున్నప్పుడు పాత ఖాతాదార్లందరూ అభ్యంతరం తెలిపారు.

"ఇప్పటికే నిన్ను పిలవడానికి ఓ మనిషిని పంపించాల్సివస్తోంది. ఇంకా ఒక ఇల్లు ఒప్పుకున్నావంటే ఇక మా పని అయినట్లే" అని అన్నారు.

కోమట్లమ్మ ఇంట్లోకి బోడి వెళ్ళిందంటే ధనలక్ష్మికి ఒక్కొక నిమిషమూ ఒక యుగంగా గడుస్తుంది. ఇంకెంత సేపు ఎంత సేపంటూ కారాలు మిరియాలు నూరుతుంది. ఈ విషయం కోమటి భార్య ఉమ్మెయాళ్ళమ్మకీ తెలుసు. ఆమెకు కొండెక్కినంత సంబరం. ధనలక్ష్మి మాడి మస్సై చావనీ అన్నట్లు బోడిని త్వరగ పోనీయకుండా ఆపుతుంది. "ఇంకో రెండు బిందెలు" అని పురమాయిస్తుంది. లేదా "కాస్త ఆ పంచెను ఉతికి ఆరేసి వెళ్ళు" అని పనులు అప్పచెపుతుంది.

ఈ సంఘటన మర్నాడు అలాగే తల్లక్రిందులుగా జరుగుతుంది. ఈసారి బోడి ధనలక్ష్మి ఇంట్లో చిక్కడిపోయి ఉంటుంది. అక్కడ కోమట్లమ్మ అగ్గిమీద గుగ్గిలం అయిపోతూ ఉంటుంది. దాన్ని తలుచుకుంటూ ధనలక్ష్మి లోలోపల సంతోషపడుతూ ఉంటుంది.

కోమట్లమ్మ ఇల్లు బోడి నీళ్ళు తెచ్చే దారిలోనే ఉంది. కాస్త ఆలస్యం కాగానే కోమట్లమ్మ అరుగు పక్కనే కనీ కనిపించనట్లు నిలబడి కాపు కాసి బోడి వచ్చేటప్పుడు "ఒసే బోడీ.." అని లోగొంతుకతో గద్దిస్తుంది.

కోమట్లమ్మ మాత్రమే కాదు. ఎవరు గద్దించినా, బెదిరించినా బోడి దగ్గర ఒకే సమాధానం.

"ఇదిగో వస్తున్నానమ్మా"

కాని రాదు. ఏ ఇంటి కోసం నీళ్ళు మోస్తోందో ఆ ఇల్లాలు "ఇక చాల్లే" అన్న తర్వాతే ఇంకో ఇల్లు.

ఇందువల్ల కొంతమంది కోపం తెచ్చుకుని బోడి రాగానే "నువ్వు రానక్కరలేదు. మేము వేరే మనిషిని చూసుకుంటాము" అని తరిమేస్తున్నట్లుగా మాట్లాడిన సందర్భాలుకూడా ఉన్నాయి. కాని బోడి వాళ్ళని వదలదు.

"ఏం చెయ్యనమ్మా.. ఏం చెయ్యనమ్మా" అంటూ అలాగే నిలబడుతుంది. వాళ్ళ కోపం కాస్త చల్లారి ఉంటుందని అనిపించిన తర్వాత చనువుగా లోపలికి వెళ్ళి బిందెనో, కుండనో తీసుకుని బయలుదేరుతుంది. వాళ్ళు కూడా 'పోనీలే' అన్నట్లు చూసీ చూడనట్లు ఉంటారు.

ఏది ఏమైనా ఆమె మీద ఆ ఊరి వాళ్ళకి లోలోపల కాస్త ప్రేమ లేకపోలేదు. ***చెడు అంటే ఏమిటో తెలియని అమాయకపు ప్రాణిపై ఉండే ప్రేమ.*** అదీగాక ఈ ప్రాణి తమ కోసం తక్కువ ఖర్చులో నీళ్ళు మోస్తోంది కదా.

ఆమె ఒక ఒంటరి వృక్షం.

కాని ఆరేడేళ్ళకు ముందు ఆమెకు భర్త, ఇద్దరు కొడుకులు ఉండేవాళ్ళు. మొదట ఆమె భర్త ఆమెను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఒకరి వెంట ఒకరుగా చిన్నవాడు రోగంతోనూ, పెద్దవాడు నీట్లో మునిగిపోయి చనిపోయారు.

చిన్నవాడికి విచిత్రమైన రోగం వచ్చింది. మూడేళ్ళు నిండిన పిల్లాడికి ఆ రోగం రాగానే శరీరం కుంచించుకు పోసాగింది. సంవత్సరం తిరిగే సరికల్లా అతను మళ్ళీ ఏడాది పిల్లవాడిగా అయిపోయాడు. కడుపు మాత్రం ఏడేళ్ళ పిల్లవాడికి ఉండేటట్లు పెద్దగా ఉండేది. అతను బ్రతుకుతాడని ఎవరికీ నమ్మకం లేదు. ఆ మాటకొస్తే ఆమెకీ ఉండటానికి ఆస్కారం లేదు. నీళ్ళు మోసేటప్పుడు మధ్యలో వచ్చి ఏదైనా తినిపించి వచ్చేది. ఆ పిల్లవాడు చనిపోయినప్పుడు పెద్దగా బాధపడినట్లు కనిపించలేదు.

పెద్దవాడికి ఏడెనిమిదేళ్ళు బర్రెల్ని కాస్తూ ఉండేవాడు. ఓసారి బర్రె మీద సవారీ చేస్తుండగా అది కాస్తా ఏట్లోకి పరిగెత్తుకుంటూ వెళింది. నీళ్ళలో పడిపోయిన పిల్లవాడికి ఈతరానందున అలాగే మునిగి చనిపోయాడు. అప్పుడు మాత్రం ఆమె రెండు రోజులో మూడు రోజులో మైలపట్టినట్లు కనపడింది. ఆ తర్వాత ఈ నీళ్ళు మోసేపని, అందులో దొరికే సంతోషం ఉన్నప్పుడు ఎవరు పోతే ఏమైంది అన్నట్లుగా అలవాటు చొప్పున నీళ్ళ బిందెను మోయసాగింది.

ఆ తర్వాత ఆ ముగ్గురి గురించి ఆమె మాట్లాడగా ఎవరూ చూడలేదు. లేదు... లేదు. మొగుడి గురించి ఒకసారి మాట్లాడింది. రెండు సంవత్సరాల క్రితం ఆమె మొగుడు మళ్ళీ ఆ ఊరికి వచ్చాడు. ఎవరూ ఎదురు చూడని విధంగా కొత్తగా ఒక వృత్తిని చేపట్టాడు.

ఒక చిన్నపిల్లవాడి తలమీద కాళికాదేవి విగ్రహాన్ని పీఠం మీద పెట్టి, చేతిలో కుంకుమ నిండిన పళ్ళెం ఇచ్చి, తను ముందుగా నడుస్తూ, కాళ్ళకి గజ్జెలతో ఆడుతూ, చేతిలో ఉన్న కొరడాతో చెళ్ళు చెళ్ళుమని ఒంటి మీద దెబ్బలు కొట్టుకుంటూ డబ్బులు అడుక్కుంటూ వచ్చాడు.

అతన్ని గుర్తుపట్టిన పిల్లలు పరిగెత్తుకుంటూ వచ్చి "బోడీ! బోడీ! నీ మొగుడు వచ్చాడు" అని చెపుతూ అతను వచ్చిన వైనం తెలిపారు. అంతా విన్న తర్వాత కాస్సేపు అలాగే శూన్యంలోకి చూస్తూ నిలబడిన బోడి చివరగా అంది. "పోతే పోయాడు పోగాలపు సచ్చినాడు."

ఇలాంటి మనిషి ఒకరోజు తన వృత్తిని వదిలి వెళ్ళిపోయింది.

ఒకరోజు చెల్లెలు ఇంట్లో ఏదో విశేషం అని బయలుదేరి భువనగిరికి వెళ్ళింది. రాత్రి రైలుకే తిరిగి వచ్చేస్తానని, ఒక్కరోజు మాత్రం ఎలాగో సర్దుకోమని అందరితో చెప్పి వెళ్ళిన మనిషి ఆ తర్వాత రానే లేదు.

ఒక వారం తర్వాత ఆమె గురించి కబురు తెలిసింది. ఆ ఊళ్ళోనే కొత్తగా ప్రారంభించిన కాకా హోటల్లో బోడి పిండి రుబ్బడానికి, అంట్లు తోమడానికి పనికి కుదురుకున్నట్లు ఎవరో చెప్పారు.

ఇక్కడ ఖాతాదార్లంతా తల్లడిల్లిపోయారు. ఇక మీద బోడి పన్లోకి రాదు అని తెల్సిన తర్వాత నీళ్ళు మోయడానికి ఎవరైన దొరుకుతారేమోనని వాకబు చేసారు. వాళ్ళు మూడు రెట్లు జీతం అడగడమే కాకుండా పన్లోకి రావడానికి ముందే ఇన్ని బిందెలు మాత్రమే తెస్తామని కండిషన్లు పెట్టారు. వాళ్ళకి ఎలా తెల్సిందో తెలియదు గాని "మేస్త్రిగారింటి నీళ్ళ తొట్టె ఇరవై బిందెలు పడుతుందట కదా" అని అన్నారు. "నర్సమ్మ ఊరికే నీళ్ళు క్రింద పారబోస్తుందట" అని కూడా అన్నారు.

ఆ తర్వాతే బోడి యొక్క గొప్పతనం, చవకలో పని చేసిన వైనం ఊరి వాళ్ళకి అర్థమైంది.

పదిహేను రోజుల తర్వాత బోడి పనికి చేరిన కాకా హోటల్ యజమాని ఎవరు అని తెలిసింది. అతను కూడా ఈ ఊరి వాడే సాక్షాత్తూ మాణిక్యం!

నలభై ఏళ్ళు పై బడిన మాణిక్యానికి భార్య ఎప్పుడో పోయింది. పిల్లా జెల్లా కూడా లేరు. తెలిసిన వృత్తి వంట మాత్రమే. అక్కడా ఇక్కడా వంట చేస్తూ కాలం గడిపాడు. మొదటి భార్య పోయిన తరువాత ఎవరూ పిల్లని ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో బాటు, ఎవరినీ పిల్లని అడిగే స్తోమత తనకి లేదని అతనే అనుకున్న కారణంగానూ అలాగే ఉండిపోయాడు. ఏడెనిమిది సంవత్సరాల క్రితం ఊరు వదిలి వెళ్ళిన మనిషి ఎలాగో కాస్తో కూస్తో కూడబెట్టి కాకా హోటల్ పెట్టాడు కాబోలు.

మరుసటి వారం అతనే ఊళ్ళోకి వచ్చాడు. అతనికి భువనగిరిలో ఉన్న బోడి చెల్లెల్ని తెలుసట. అక్కడే ఉండమని బోడిని చెల్లెలు బలవంతం చేసిందట. అతన్ని అడిగినప్పుడు బోడి అక్కడ బాగానే ఉన్నట్లు చెప్పాడు.

సుమారు రెండు నెలల తర్వాత ఏదో ఉన్న రెండు మూడు అల్యూమినియం గిన్నెల్ని తీసుకెళ్ళడానికి బోడి ఆ ఊరికి వచ్చింది. ఎవరూ ఎదురు చూడని విధంగా బోడి బాగానే ఉంది. కాస్త వళ్ళు చేసి రంగు కూడా తేలింది. కళకళలాడుతున్న ముఖం మంచి చీర.

కాని తల మాత్రం బోడిగానే ఉంది. ఎవరో ఆమెను అడగను కూడా అడిగారు 'జుట్టు పెంచుకోకూడదూ" అని. "ఊహూం" అంది. వెళ్ళేముందు అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుంది.

ఆ తర్వాత ఒక నెల గడిచి ఉంటుంది.

ఊళ్ళో జనం ఆమెను దాదాపు మర్చిపోయారనే చెప్పాలి.

కాని ఒక రోజు ప్రొద్దున్న ఊళ్ళో చిన్న కలకలం రేగింది. "బోడి వచ్చేసింది... బోడి వచ్చేసింది."

"బోడి మునుపటిలాగే నీళ్ళు మోసి బ్రతకడానికి ఈ ఊరికే వచ్చేసిందట"

పాత ఖాతాదార్లందరికీ పెద్ద భారం దించినట్లయింది. ఆ రోజు ఉదయమే తమ ఇంట్లో నీళ్ళు తెచ్చే మనిషిని రానక్కర్లేదని చెప్పేసారట కూడా.

కాని ఊళ్ళో ఒక్కరు వదలకుండా అందరి మనస్సులోనూ తలెత్తిన ప్రశ్న, సౌకర్యమైన ఆ జీవితాన్ని వదిలేసి మళ్ళీ ఈ ఊరికి నీళ్ళు మోసి చావడానికి బోడి ఎందుకు వచ్చింది అని.

చాలా మందికి అనుమానం మాణిక్యం కాకా హోటల్ని బిచాణా ఎత్తేశాడేమోనని. అంతగా బ్రతకనేర్చిన మనిషి కాదు కదా.

కాని విషయం అది కాదు. కాకా హోటల్ బాగానే నడుస్తోందని బోడి చెప్పింది.

మరి కారణం ఏమై ఉంటుంది?

బోడి మౌనంగా ఉండిపోయింది. కోమట్లమ్మ, ధనలక్ష్మితో సహా అందరినీ "మునుపటిలాగా నీళ్ళు మోయడానికి రానా?" అని అడిగింది.

బోడికి చాలా కావాల్సిన వాళ్ళు పాపమ్మ, ముత్తమ్మ. ముందు వసారాలో జొన్నలు దంచుతున్నప్పుడు, బోడి వీధిలో వస్తుండగా చూసి కాపు కాసి పట్టుకున్నారు, "ఒసే బోడీ! ఇలా రావే."

"ఏంటక్కా?" అమాయకంగా అడుగుతూ వాళ్ళ దగ్గరికి వచ్చింది బోడి.

తనకూ బోడికీ మధ్య ఉన్న చనువును హక్కుగా తీసుకుని పాపమ్మ కటువుగా అడిగింది. "ఏంటే? నెత్తి మీద నీళ్ళ బిందె లేకపోతే ఒంటి మీద చీర లేనట్లుగా ఉందా?"

"ఏంటక్కా?"

"మరి అక్కడ హోటల్ పని వదిలేసి ఎందుకు వచ్చినట్లు? ఏదో నాలుగు అంట్లు తోమి నీడలో బ్రతకమంటే చేదుగా ఉందా? ఇక్కడికి వచ్చి ఎండనకా వాననకా రోడ్లంబట నెత్తి మీద బరువుతో తిరుగుతూ చావడం తియ్యగా ఉందా?"

బోడి బదులు చెప్పలేదు.

"ఆ మనిషి జీతం అదీ సరిగ్గానే ఇచ్చేవాడు కదా?"

"ఊం"

మళ్ళీ మౌనం.

"చెల్లెలితో ఏదైనా గొడవ పడ్డావా?"

"అదేం లేదు."

"మరి ఎందుకు వచ్చినట్లు?"

మళ్ళీ మౌనం.

"ఊర కుక్కను నీడపట్టున హాయిగా ఉండమంటే మురికి గుంటనే పట్టుకుని వేళ్ళాడిందట ఇదే కాబోలు."

ఈ మాట వినగానే బోడి ముఖంలో ఉన్నట్లుండి రోషం పొంగి వచ్చింది. పాపమ్మ, ముత్తమ్మ కొంచెం కూడా ఎదురు చూడని కోపం. ఉక్రోషం నిండిన కోపం.

బోడి ఎఱ్రబడిన ముఖంతో పాపమ్మ ముఖానికి ఎదురుగా చెయ్యి చాపుతూ అన్నది. "వాడు నన్నూ.. నన్నూ ఉంపుడుగత్తెగా ఉండమన్నాడు."

పాపమ్మ, ముత్తమ్మ దిగ్భ్రమ చెందినట్లు చూశారు. కాసేపు అక్కడ మౌనం రాజ్యం ఏలింది.

వస్తాను అని కూడా చెప్పకుండా బోడి అక్కడ్నించి బయలు దేరింది. ఆమె వెళుతున్న వైపే చూస్తూ నిలబడిపోయారు పాపమ్మ, ముత్తమ్మ.

అది కూడా ఒక్క నిమిషమే. ఆ తర్వాత ఏదో తోచినట్లు వాళ్ళ ముఖంలో ఆశ్చర్యం మాయమై ఆ స్థానంలో సన్నని నవ్వు కదలాడింది.

వెళుతూ ఉన్న బోడిని చూస్తూ ముత్తమ్మ మెల్లగా అన్నది. "ఉండమంటే ఉంటే పోలా?"

పాపమ్మ కిసుక్కుమని నవ్వింది. "అంతే కదా మరి" అంటూ బోడి వీపుకేసి చూసింది. ఆ తర్వాత ఇద్దరూ కాసేపు ఏదేదో ఊహించుకుని పెద్దగా నవ్వుకుంటూ జొన్నల దంపుడులో దిగారు.

ఇది ఆ ఇద్దరి అభిప్రాయం మాత్రమే కాదు. ఈ మాట తమ దాకా వచ్చినప్పుడు ఆ ఊర్లో చాలామంది ఇలాగే అనుకున్నారు. వాళ్ళ దృష్టిలో ఇది ఆమె తాహతు కన్నా మించిన సౌకర్యం. ఆ సంబంధాన్ని ఆమె నూటికి నూరు పాళ్ళు అంగీకరించి ఉండాల్సిందని వాళ్ళ అభిప్రాయం. ఇప్పుడు ఆమె ఉన్న స్థితికి అదేం తీసిపోయిందన్నది వాళ్ళ ప్రశ్న.

ఒకటో రెండో నెలల తర్వాత మాణిక్యం ఆ ఊరికి ఏదో పని మీద మళ్ళీ వచ్చాడు. ఊళ్ళో కొంత మంది అతన్ని తమాషాగా "ఏంటీ సంగతి?" అని అడిగినప్పుడు తనకేమీ పట్టనట్టు "అదొక పిచ్చిమాలోకం" అని మెల్లగా జారుకున్నాడు.

ఇప్పుడు బోడి ఊళ్ళో మునుపటి లాగా పాతబడిపోయింది. ఐదారు ఇళ్ళకి నీళ్ళు మోస్తూ తిరుగుతూ ఉంది.

ఆమె లేనప్పుడు ఆమె గొప్పతనాన్ని గుర్తించిన ఊరి జనం అన్నీ మరిచి పోయి మునుపటిలాగే అధికారం చెలాయిస్తూ, విసుక్కుంటూ పని చేయించుకున్నారు.

బోడి మళ్ళీ చిక్కిపోయింది. వన్నె మాసిపోయింది. ఆ రెండు నెలల జీవిత ఛాయలు ఆమె జ్ఞాపకాలలో కొంచెం కూడా ఉన్నట్లు కనబడలేదు.

ఊళ్ళో మాత్రం ఎవరికైనా జ్ఞాపకం వస్తే ఆమెను సతాయిస్తూ ఏదైనా అనే వాళ్ళు ఏడిపించాలని ప్రయత్నించే వాళ్ళు. అందులో వాళ్ళు గెలుపు సాధించేటప్పుడు ఆమె అదే రోషంతో ఎఱ్రబడిన ముఖంతో చెయ్యి చాపి "వాడు నన్నూ... నన్నూ..." అంటూ సాగదీసేది. దాన్ని చూసి వాళ్ళు ఆనందిస్తున్నారు.

మీరు కావాలనుకుంటే ఇప్పుడు కూడా ఆమెను ఆ గ్రామంలో చూడవచ్చు.



అనువాద రచయిత్రి

గౌరీకృపానందన్